06 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 128 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



## ఢిల్లీకి బయలుదేరిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంత్రి వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుపై సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున బలమైన వాదనలు వినిపించడానికి సిద్ధమైంది ఇందులో భాగంగా ఢిల్లీకి వెళ్లి సీనియర్ న్యాయవాదులను కలిసి న్యాయపరమైన అంశాలపై చర్చించనున్నారు ప్రభుత్వ పక్షాన బలమైన వాదనలు వినిపించాలని సూచనలు చేయనున్నారు




# స్థానికంపై 'ప్లాన్ బీ'!

- 6, 8 తేదీల్లో సుప్రీం, హైకోర్టుల్లో బీసీ రిజర్వేషన్, చట్ట సవరణపై విచారణ
- కోర్టు తీర్పుల ఆధారంగా వెంటనే స్పందించేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- ప్రతికూల తీర్పులు వస్తే పాత రిజర్వేషన్ల ప్రకారం వారం ఆలస్యంగా ఎన్నికలు
- కొత్తగా షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికల నిర్వహణకు పీఆర్ శాఖ ప్రణాళిక
- బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయం తీసుకొనే వరకు వేచిచూసే మరో ప్లాన్

**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురైతే.. అందుకు అనుగుణంగా వ్యూహాన్ని మార్చుకుని 'ప్లాన్ బీ'ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, మొత్తంగా 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై న్యాయస్థానాల్లో ప్రతికూల తీర్పులు వస్తే.. ఏం చేయాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు ఈ నెల 6న సుప్రీంకోర్టులో, 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో విచారణకు రానున్నాయి.**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**

### కోర్టుల వైపు అందరి చూపు..

పంచాయతీరాజ్ చట్ట సవరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ జీవోను కొట్టేయాలని గత నెల 27న ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. ఆ పిటిషన్‌పై ఈ నెల 8న హైకోర్టు విచారణ జరపనుంది. నాటి విచారణలో బిల్లు ఇంకా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది.

ఈ దశలో రిజర్వేషన్ల పెంపుదలను ఆమోదించలేమని, అదేవిధంగా ఎలాంటి నిలిపివేత ఆదేశాలు జారీ చేయలేమని తెలిపింది. ఒకవేళ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసినా.. పిటిషన్లు ముందే దాఖలు చేసినందున మెరిట్ ఆధారంగా విచారణ చేస్తామని తెలిపింది. తాము ఇచ్చే తీర్పు మేరకే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తేల్చి చెప్పింది. దీంతో 8న కోర్టు ఏం తేలుస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.

### పాత రిజర్వేషన్ల ప్రకారమూ సిద్ధమే...

సుప్రీం, హైకోర్టుల్లో వ్యతిరేక తీర్పులు వస్తే పాత రిజర్వేషన్ల పద్ధతిలోనే (50 శాతానికి లోబడి) ఎన్నికలు నిర్వహించేందుకు కూడా పీఆర్ శాఖ సన్నాహాలు చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్లను ఖరారు చేసినందున, వాటిని అలాగే ఉంచి గతంలో మాదిరిగా బీసీలకు 23 శాతం రిజర్వేషన్ల కల్పనకు మొగ్గుచూపే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఓటర్ల జాబితాల ఆధారంగా గ్రామపంచాయతీల్లోని వార్డులవారీగా ఫొటోలతో కూడిన ఓటర్ జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. కోర్టుల తీర్పు మేరకు ప్రభుత్వం మళ్లీ బీసీ కోటాపై తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా బీసీ, అన్ రిజర్వ్‌డ్ రిజర్వేషన్లను ఖరారు చేసి, వారంలోనే మరోసారి ఎన్నికల షెడ్యూల్ జారీ చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే ఎస్ఈసీ జారీచేసిన ఎన్నికల షెడ్యూల్స్ మార్చి వారం రోజుల అంతరంతో నిర్వహించేలా మరోసారి షెడ్యూల్‌ను



## జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పై తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్ష

### పాల్గొన్న మంత్రి తుమ్మల పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

### బూత్ లెవెల్ కమిటీలు ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేసిన మీనాక్షి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
త్వరలో జరగనున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మంత్రి తుమ్మల తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ,బూత్ లెవెల్ కమిటీలు నియామకం పటిష్టంగా చేయాలని మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ప్రతినిధి విశ్వనాథన్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ 22 కార్పొరేషన్ చైర్మన్ లు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన
- ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్
- ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ



# మండల స్థానిక సంస్థల సన్నాహా సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క

**ములుగు వెలుతురు అక్టోబర్ 05:**
ములుగు నియోజకవర్గ పరిధిలో కొత్తగూడ మండలం స్థానిక సంస్థల సన్నాహా సమావేశంలో తెలంగాణ శిశు సంక్షేమ మరియు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు సీతక్క పాల్గొనడం జరిగింది. మంత్రి వర్యులు సీతక్క గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకం ప్రతి ఇంటి దాకా చేరాలని ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు లేదు అని పది సంవత్సరాల నియంత పాలనతో ప్రజల మనసు విరిగి కాంగ్రెస్ పార్టీ వైపు చూసారని ఆ నమ్మకానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది అని అన్నారు. అనంతరం పోగుళ్ళపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క గారి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ కీ రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. బండి కుమార్ , నోముల పెద్ద వెంకన్న, పప్పు సురేష్.





మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేస్తామని అన్నారు. కొత్తగూడ, గంగారాం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రివర్యులు సీతక్క
మహబూబాబాద్



## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన
- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ
- మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి
- ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సలహా
- జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ సజ్జనార్ భేటీ

## తన రాజీనామా వార్తలపై దానం నాగేందర్ క్లారిటీ

- సోషల్ మీడియా ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- తాను ఎలాంటి రాజీనామా చేయడం లేదని స్పష్టం చేసిన నాగేందర్
- ఈ తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
తన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని,

## ముస్లింల గౌరవానికి కబ్రస్థాన్ కేటాయింపు

# రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

### జూబ్లీహిల్స్ ముస్లింలకు న్యాయం - మళ్లీ కాంగ్రెస్‌కే గెలుపు బాట!

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
మతానికి గౌరవం, మానవత్వానికి ప్రాధాన్యం ఇదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధ్యేయం అని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు. ముస్లింల కబ్రస్థాన్ స్థలాల కేటాయింపుతో ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి, మైనారిటీల పట్ల ఉన్న కట్టుబాటుకు నిదర్శనం అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మైనారిటీ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, కార్పొరేషన్ చైర్మన్లు ఒబెదుల్లా కొత్వాల్, అజారుద్దీన్, మత పెద్దల సమక్షంలో కబ్రస్థాన్ స్థలం కేటాయింపు కు సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేశారు.




## ములకలచెరువు కల్తీ మద్యం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్... కఠిన చర్యలకు ఆదేశం

- ములకలచెరువు నకిలీ మద్యం ఘటనపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రజల ప్రాణాలకు హాని కలిగించే కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని స్పష్టీకరణ
- ప్రధాన నిందితుడు విదేశాల్లో ఉన్నట్లు గుర్తించిన ఎక్సైజ్ అధికారులు
- ఇప్పటికే 10 మంది అరెస్ట్, మరో నలుగురి కోసం కొనసాగుతున్న గాలింపు

**అన్నమయ్య జిల్లా వెలుతురు అక్టోబర్ 05:**
రాష్ట్రంలో నకిలీ మద్యం విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను దిశానిర్దేశం చేశారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగుచూసిన భారీ నకిలీ మద్యం రాకెట్ వ్యవహారంలో నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టవద్దని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని ఆయన



# స్థానికంపై 'ప్లాన్ బీ'!

జారీ చేసే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.
అవసరమైన మార్పులు చేశాక మండల, జిల్లా పరిషత్ ఎన్నికల తొలివిడత నోటిఫికేషన్ 9వ తేదీకి బదులు 16న జారీచేసి, ఎన్నికలను 23వ తేదీకి బదులు 30న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా మిగతా నాలుగు విడతలకు కూడా వారం రోజుల అంతరంతో నోటిఫికేషన్, మిగతా దశల ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. ఇలా గతంలో ప్రకటించిన విధంగా నవంబర్ 11కు బదులు 18న ఎన్నికల ప్రక్రియను ముగించే అవకాశం ఉందని చెబుతున్నారు.
మరో నెల వేచి చూస్తే ఎలా ఉంటుంది?
రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే పట్టుదలతో ఉన్న పక్షంలో అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకునే గడువు వరకు వేచి ఉండే అవకాశం లేకపోలేదని అధికారపార్టీ నేతలు చెబుతున్నారు. పెండింగ్ బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్‌లు మూడు నెలల్లోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని, లేదంటే అవి ఆమోదం పొందినట్టు భావించాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు చెప్పిన విషయం తెలిసిందే.
కాగా మొదటి రెండు పర్యాయాలు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానిక ఎన్నికల్లో 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై (పీఆర్ చట్టానికి సవరణలతో) అసెంబ్లీ ఆమోదించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. మరో 25 రోజులైతే ఆ బిల్లును పంపి 90 రోజులు అవుతుంది. అందువల్ల దీనితోపాటు సుప్రీంకోర్టు, రాష్ట్రపతి నుంచి వచ్చే స్పందనల కోసం మరో నెల వేచి చూస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా అధికార వర్గాల్లో సాగుతోంది.బి

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.

# మండల స్థానిక సంస్థల సన్నాహా సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క

జిల్లా కొత్తగూడ, గంగారాం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారు పాల్గొని నాయకులకు దిశానిర్దేశం చేశారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోయే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అందరిని వందకు వంద శాతం గెలిపించాలని అన్నారు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి జనాలకు తెలియచేస్తూ అభ్యర్థుల విజయంలో తోడుగా ఉండాలని నాయకులకు సూచించారు ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి సీతక్క గారి చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి,కొత్తగూడ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య,గంగారాం మండల పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు,యూత్ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి,జిల్లా నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు. అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

# ముస్లింల గౌరవానికి కబ్రస్థాన్ కేటాయింపు.. రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ –"ముస్లింలకు జీవన గౌరవం ఉన్నట్లే మరణానంతర గౌరవం కూడా ఉండాలి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమాధి భూముల సమస్యను ఈ ప్రభుత్వం పరిష్కరించిందంటే అది ప్రజల విశ్వాసానికి ఇచ్చిన గౌరవం," అన్నారు. "సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, మైనారిటీల అభ్యున్నతి దిశగా స్పష్టమైన మార్గాన్ని అనుసరిస్తోంది. దేశంలో బలహీన వర్గాలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే," అని మంత్రి వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, షేక్‌పేట్, గోల్కొండ పరిసర ప్రాంతాల్లో స్థలాభావం ఉన్నప్పటికీ న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. హెచ్ఎండిఏ, కలెక్టర్ల సమన్వయంతో లీగల్, భౌగోళిక అడ్డంకులను తొలగిస్తున్నామని వివరించారు. "పాత కబ్రస్థాన్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తాం. లైటింగ్, డ్రైనేజీ, రోడ్లు, నీటి సదుపాయాల పనులు చేపడతాం. ఆక్రమణలు జరగకుండా బౌండరీ వాల్ నిర్మాణం చేస్తాం. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక సమాధి భూమిని గుర్తించడమే లక్ష్యం," అని తెలిపారు. "ధార్మిక హక్కులను కాపాడడమే నిజమైన సెక్యులరిజం. సీఎం రేవంత్‌రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది," అని పేర్కొన్నారు. గత టీఆర్ఎస్ పాలనలో మైనారిటీల సమస్యలను నిర్లక్ష్యం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని తిరిగి గెలుచుకుందని మంత్రి అన్నారు. "మాట ఇస్తే పని చేస్తుంది అదే కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయత," అని స్పష్టం చేశారు. తాను మైనారిటీ శాఖ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆరు మైనారిటీ కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం జరగడం ఈ ప్రభుత్వ ము మైనారిటీల పట్ల వున్న చిత్త శుద్ధి ప్రతిబింబిస్తోందన్నారు. వక్ఫ్ స్థలాలు, కబ్రస్థాన్ భూముల రక్షణకు కలెక్టర్లతో సమన్వయం కొనసాగుతోందని వివరించారు. "రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మత, సాంస్కృతిక గుర్తింపును గౌరవిస్తోంది. ముస్లింల అభ్యున్నతికి ప్రత్యేక నిధులు కేటాయించి, సమాధి స్థలాల సర్వేలు, అభివృద్ధి పనులను వేగవంతం చేసింది," అని మంత్రి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించామని, రాబోయే రోజుల్లో దానిని రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "జూబ్లీహిల్స్ లో ముస్లిం మైనారిటీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని , ఇక ముస్లిం మైనార్టీలు కూడా కాంగ్రెస్‌పై నమ్మకంతో ముందుకు కొనసాగలని," అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

# ములకలచెరువు కల్తీ మద్యం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్... కఠిన చర్యలకు ఆదేశం

సూచించారు. ములకలచెరువు ఘటన నేపథ్యంలో ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ములకలచెరువులో నకిలీ మద్యం దందా గుట్టును ఎలా రట్టు చేశారో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తొలుత కొందరు వ్యక్తులు నకిలీ మద్యం బాటిళ్లతో పట్టుబడగా, వారిని విచారించి సేకరించిన సమాచారంతో ములకలచెరువు సమీపంలోని కదిరినత్తునికోట గ్రామంలో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో భారీ నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందని వివరించారు. ఈ దందాకు సంబంధించి మొత్తం 14 మందిని గుర్తించామని, వారిలో ఇప్పటికే 10 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి ఫేక్ లేబుళ్లు, స్టిక్కర్లు, వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రాకెట్ వెనుక ప్రధాన సూత్రధారి (ఏ1) అద్దేపల్లి జనార్దన్ రావు అని, అతనికి విజయవాడలో ఒక బార్ లైసెన్సు కూడా ఉందని అధికారులు గుర్తించారు. కేవలం నకిలీ మద్యం దందా కోసమే అతను ములకలచెరువుకు వచ్చాడని, ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను పనిలో పెట్టుకుని ఈ కేంద్రాన్ని నడిపిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇక్కడ తయారు చేసిన నకిలీ మద్యాన్ని పెద్దతిప్పసముద్రంలోని ఆంధ్రా వైన్స్, ములకలచెరువులోని రాక్ స్టార్ వైన్స్ అనే రెండు లైసెన్సు ఉన్న దుకాణాల ద్వారా విక్రయించినట్లు నిందితులు అంగీకరించారని అధికారులు వివరించారు. రాక్ స్టార్ వైన్స్ లైసెన్సుదారుడైన టి. రాజేష్‌కు చెందిన వాహనంలోనే నకిలీ మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని, సదరు రెండు వైన్ షాపులను సీజ్ చేశామని తెలిపారు. ఈ కేసులో స్థానిక నాయకుడు జయచంద్రారెడ్డి పాత్రపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు జనార్దన్ రావుతో పాటు మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని, ఈ దందా వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలు, సరఫరా నెట్‌వర్క్‌పై లోతుగా విచారణ జరుపుతున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. అధికారుల నివేదిక విన్న అనంతరం చంద్రబాబు, ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలని కఠినంగా ఆదేశించారు.

# దేవాలయ నిర్మాణానికి దాతలు భారీ విరాళాలు

**- విరాళాలు అందజేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు ఘన సత్కారం...**

**వెలుతురు, చారకొండ అక్టోబర్ 05 :**
జేపల్లి గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి జేపల్లి గ్రామంలో ఆదివారం పలువురు నుంచి భారీ విరాళాలు అందజేశారు. విద్యుత్ శాఖ లైన్ మెన్ మల్లెపాకుల శ్రీనివాసులు రూ.25,116, మల్లెపాకుల పెద్ద శేఖర్ రూ. 15,116, మాజీ వార్డు సభ్యులు మల్లెపాకుల శేఖర్ రూ.10,116, సీనియర్ జర్నలిస్టు మల్లెపాకుల పరుశురాం రూ.10,116, జక్కుల కృష్ణ రూ.10,116, మల్లెపాకుల సైదులు (ఆర్టీసీ) 5,116, మల్లెపా కుల రఘునందన్ రూ.5,116, మాడ్గుల ప్రశాంత్ రూ.5,116, ఇటిక్యాల గోవర్ధన్ రెడ్డి రూ.5016, యం.డి. బురాన్ రూ.5,000, మురళీధర్ రెడ్డి రూ. 3,116, మద్ది వెంకట్ రెడ్డి 3,016, దాదేమోని నరసింహ రూ.2,016, దాదేమోని శారదమ్మ రూ.2,116, యం. డి. ఫరీద్ రూ.2116, మల్లెపాకుల బిక్షపతి రూ. 2,116, వసంతపు అల్లాజీ రూ. 2,116, జక్కుల మల్లేష్ రూ.1,116 విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు గునుగంటి శ్రీనివాస్ రావును మర్యాద పూర్వకంగా కలవడంతో దేవాలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విరాళాలు అందజేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చలకుర్తి చిన్నారుల ఖాతాలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్




**చలకుర్తి వెలుతురు అక్టోబర్ 05:**
ఆదివారం రోజున చెన్నై లోని తాభరం ప్రాంతంలోనీ S.I.V.E.T కళాశాల మైదానంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెండ్ లార్జెస్ట్ కరాటే డిస్ప్లే నందు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించడంలో పాతనబోయిన సుదీక్ష , పాతనబోయిన విహాస్ భాగస్వామ్యులు అయ్యారు . ఇట్టి గిన్నిస్ రికార్డు నందు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ , తమిళనాడు , కర్ణాటక , కేరళ కు చెందిన పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు . ఈసందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ ఇట్టి గిన్నిస్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందని తమపై బాధ్యత కూడా పెంచిందని మునుముందు మరింత కఠోరశ్రమతో సాధన చేసి మరెన్నో అంతర్జాతీయ పతకాలు సాధించి పుట్టిన ఊరికి , తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకువస్తామని , చిన్ననాటి నుండే శిక్షణ ఇప్పించి నిరంతరం తమవెంట ఉండి నడిపిస్తున్న తల్లితండ్రులకు , శిక్షణలో మెళకువలు నేర్పించి మంచి మంచి అవకాశాలు ఏర్పాటు చేసిన కోచ్ మహేష్ నాయక్ కి ధన్యవాదాలు తెలియచేశారు.

# తన రాజీనామా వార్తలపై దానం నాగేందర్ క్లారిటీ

అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక ఎవరున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దానం నాగేందర్ సూచనప్రాయంగా తెలిపారు.

# బాగ్ అంబర్పేట్ లో పేదలకు సహాయం చేసే వ్యక్తిత్వం ఉన్నవారు



**బషీర్బాగ్ వెలుతురు 5 అక్టోబర్ :**
బాగ్ అంబర్పేట్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ లోని నవరాత్రులను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన వ్యాపారవేత్త గంజి అశోక్ కుమార్ నేత పేదలకు స్కూళ్లలో పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తారు ఆయన వ్యక్తిత్వం అయన అభిమాతం

# వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు



**బషీర్బాగ్ వెలుతురు 5 అక్టోబర్:**
కేంద్ర మాజీ మంత్రి లక్షలాది మంది కార్మికులకు పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టడానికి పోరాటం చేసిన గడ్డం వెంకట్ స్వామి (కాక ) గారి జయంతి వేడుకలకు గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ (బాలన్న ). ఆధ్వర్యంలో వందలాది మంది నివాళు లు అర్పించారు మాల సంఘాల జేఏసీ నాయకులు కాక వెంకట స్వామి గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసి గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్ , తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ , తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కన్వీనర్ నల్లాల కనకరాజు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్, అడ్వైజర్స్ కొరివి వేణుగోపాల్ కె బాలకృష్ణ యూత్ అధ్యక్షులు డాక్టర్ వీరస్వామి నామ సైదులు అనిల్ శివరాజు మాణిక్యం ఆనందం రాజు తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక సహాయం అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 05**
మండలం వెల్లంకి గ్రామంలో బలికే లక్ష్మమ్మ



అనారోగ్యంతో మరణించడం జరిగింది.లక్ష్మమ్మ కి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి తరఫున 5,000 రూపాయల ఆర్థిక సాయం అందజేసిన టిఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఎడ్ల నరేందర్ రెడ్డి జరిగింది.అలాగే ఇడం స్వరూప స్మారక సేవా సంస్థ తరపున ఈడెం శ్రీనివాస్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పున్న వెంకటేశం, పిట్ట మహేందర్ రెడ్డి మరియు తలారి నరసింహ, బలికే నరసింహ, మంగ శ్రీశైలం, బలికే లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**- మంచాల మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్**



**మంచాల వెలుతురు అక్టోబర్ 5:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బిజెపి పార్టీ సమావేశం గ్రామ కన్వీనర్ కోకన్వీనర్ కొత్తపల్లి శేఖర్ గౌడ్, మెండు శ్రీనివాసరెడ్డి గార్ల ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎంపీటీసీ, సర్పంచ్, వార్డ్ మెంబర్ల పరిధి లో సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ ముఖ్యఅతిథి పాల్గోని జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులుఒక సైనికుడిలా పని చేసి మంచాల మండలంలో బిజెపి పార్టీ సత్త ఏమిటో చూపించాలి అన్నారు ప్రతిసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏదో ఒకరాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో బిజెపి పార్టీపోటీ చేసేది ఇప్పుడు అలాకాదు బిజెపి పార్టీ ఒంటరిగా పోటీచేసి మంచాల మండలంలో మా సత్తా ఏమిటో చూపిస్తాం అని అన్నారు ప్రతికార్యకర్త నాయకుడు మన భారత ప్రధాని నరేంద్రమోడీ పేదప్రజల కోసం ప్రవేశపెడుతున సంక్షేమ పథకాల గురించి ప్రతి గడప దగ్గరికి వెళ్లి ప్రజలకు వివరించాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పాండాల జంగయ్య గౌడ్ సొసైటీ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి మెండు వెంకటరెడ్డి కొత్తపల్లి మహేందర్ గౌడ్ సత్తిరెడ్డి గంట నరసింహారెడ్డి మందం మోహన్ రెడ్డి భగవంతు రెడ్డి నరసింహారెడ్డి గుడ్డిమల్లి సత్యనారాయణ ముదిరాజ్ తంగడపల్లి నరేందర్ గౌడ్ పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి వేరే రవీందర్ రెడ్డి అచ్చిన రవీందర్ గంట రాజు రెడ్డి, రవీందర్ రెడ్డి కర్ణాకర్ రెడ్డి రాఘవేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి సంతోష్ జగన్ రెడ్డి కందాల నరేష్ ప్రసాద్ రెడ్డి బూత్ అధ్యక్షులు కార్యాకర్తలుపాల్గొన్నారు.

## దాదుపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీఈశ్వర రామాంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవం



**మంచాల వెలుతురు అక్టోబర్ 5:**



మంచాల మండలం దాదుపల్లిగ్రామంలోశ్రీ శ్రీ శ్రీ ఈశ్వర రామాంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలు ఈనెల 3తేదీ శుక్రవారంనుండి మొదలు అయినా కార్యక్రమాలు 6వ తేదీ సోమవారం రోజు వరకు ఉంటాయి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు శుక్రవారం రోజు హెూమం జరిగింది శనివారం రోజు జలాభిషేకం ఆదివారం రోజు ధన్యాభిషేకం పూలాభిషేకం ఈరోజు ధన్యాభిషేకం పూలాభిషేకం సోమవారం రోజు విగ్రహ ప్రతిష్టాపనలు ప్రత్యేకపూజలు ఉంటాయని అన్నారు ప్రతిరోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాము అని ఆలయ కమిటీసభ్యులు అన్నారు ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాలంటీర్స్ టీం భక్తులు తదితరులు పాల్గొన్నారు

## టీం జగన్మాత అమ్మవారు బాగ్ అంబర్పేట్ లో ప్రత్యేక ఆకర్షణ



**బషీర్బాగ్ వెలుతురు 5 అక్టోబర్ :**
బాగ్ అంబర్పేట్ శ్రీనివాస్ నగర్ కాలనీ లోని నవరాత్రులను పురస్కరించుకొని టీం జగన్మాత ఏర్పాటు చేసిన అమ్మవారు 11 రోజులు పూజలు నిర్వహించాము నిమజ్జనం కార్యక్రమంలో నిర్వహించాము ముఖ్య అతిథులుగా విచ్చేసిన అంబర్పేట్ ఎస్ హెచ్ ఓ కిరణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మిర్యాల శ్రీనివాస్ గాజుల గోవింద్దామోదర్, తక్కలపల్లి మాధవరావు, డి కొండ నవీన్, సంజీవ్ చౌదరి, గోవింద్ అర్జున్ పాల్గొన్నారు.

## బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నప్పుడు కోర్టుల ద్వారా అడ్డు కోవాలని చూడడం సిగ్గుచేటు

**- రిజర్వేషన్ వ్యతిరేకులని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయి**

**- బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల ద్వారా అడ్డుకోవాలని చూడడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఇన్ని సంవత్సరాలు బీసీలు వారి జనాభా కంటే అన్ని రంగాల్లో (విద్యా,ఉద్యోగ,రాజకీయ) తక్కువ శాతం అనుభవిస్తున్నారని బీసీలు ఉన్నది 60 శాతం అయితే వారు కల్పిస్తామన్నది 42 శాతం రిజర్వేషన్లేనని దానికి కొంతమంది కుట్రలు కు తంత్రాలు పన్ని రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి హైకోర్టులో మరియు వంగా గోపాల్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని ఇన్ని సంవత్సరాలుగా బీసీలకు రావాల్సిన వాటాను మీరు అనుభవించడం లేదా అని లింగంగౌడ్ ప్రశ్నించారు. రిజర్వేషన్ వ్యతిరేకులను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

# వృద్ధుల భరోసా కోసం కొత్త దారి

# రేవంత్ ప్రతిపాదనపై జాతీయ చర్చ...!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు

*"మాతృ దేవోభవ, పితృ దేవోభవ" అని శతాబ్దాలుగా గర్వంగా చెప్పుకుంటున్న భారతీయ సంస్కృతి, ఈనాటి కాలంలో విలువలు కోల్పోతున్నాయనే ఆందోళన మరింతగా పెరుగుతోంది. తల్లిదండ్రులు మన జీవితానికి పునాది, వారి సేవే గొప్ప పూజ అని పాత తరం చెబుతూనే వచ్చింది. కానీ ఆధునిక యాంత్రిక యుగంలో, స్వంత జీవిత పోరాటంలో మునిగిపోయిన ఈ తరం వారిని మరచిపోతోంది. ఉద్యోగం కోసం నగరాలు, విదేశాలు చేరిన పిల్లలు, చదువు కోసం కొత్త దారులు తీసుకున్న యువత, స్వాతంత్ర్యం పేరిట వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చే మనస్తత్వం - ఇవన్నీ కలసి వృద్ధులను ఒంటరిని చేస్తున్నాయి. తల్లిదండ్రుల కోసం కృతజ్ఞతతో ముందుకు రావాల్సిన తరమే వారిని వృద్ధాశ్రమాల కరుణకు వదిలేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.*

ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తల్లిదండ్రులను పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో పది శాతం కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన చెప్పడం కేవలం ఆర్థిక చర్య కాదు, సమాజానికి విలువల పునరుద్ధరణ సందేశం కూడా. అంతేకాకుండా, ప్రైవేట్ రంగ ఉద్యోగులకూ ఇదే నిబంధన వర్తింపజేసే దిశగా ప్రభుత్వం కంపెనీలతో మాట్లాడాలని ప్రజలు కోరుతున్నారు. ఇక ఈ ఆలోచనను సీఎం ప్రస్తావించడం, దీనికి మరింత విస్తృతతను ఇచ్చింది. ఈ ప్రతిపాదన వాస్తవానికి ఒక కఠినమైన చర్యలా కనిపించినా, సమాజంలో విలువలు క్షీణిస్తున్న సమయంలో ఇది అవసరమైన చొరవగా చెప్పుకోవచ్చు.

భారతీయ సంస్కృతి మూల సారం తల్లిదండ్రుల పట్ల గౌరవమే. వేదాలలోనే మాతృ దేవోభవ, పితృ దేవోభవ అని ఉపదేశించారు. రాముడు తండ్రి మాట కోసం వనవాసం స్వీకరించడం, శ్రవణ కుమారుడు తన వృద్ధ తల్లిదండ్రులను భుజస్కంధాలపై మోసుకుంటూ తీర్థయాత్రలకు వెళ్లడం మన పురాణాల ఉదాహరణలు. తెలుగు సాహిత్యం నుండి తమిళం, సంస్కృతం వరకు అన్ని భాషల్లో తల్లిదండ్రుల పట్ల గౌరవం ఒక ప్రధాన విలువగా వర్ణించబడింది. కానీ కాలక్రమేణా సంయుక్త కుటుంబ వ్యవస్థలు కూలిపోయి అణు కుటుంబాలు పెరగడంతో వృద్ధులు కుటుంబంలో రెండవ స్థానానికి జారిపోయారు. ఆధునికత పేరుతో పిల్లలు తమకు స్వంత జీవితం ఉందని చెప్పుకుంటూ, తల్లిదండ్రులను జీవితంలో భారంగా చూడడం ప్రారంభించారు.

సంఖ్యలు చెబుతున్న వాస్తవాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2011 జనగణన ప్రకారం భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులు 10.4 కోట్లు. 2025 నాటికి ఈ సంఖ్య 17 కోట్లకు చేరుకుంటుందని అంచనాలు ఉన్నాయి. 2050 నాటికి 30 కోట్లకు పైగా వృద్ధులు ఈ దేశంలో ఉండబోతున్నారు. ఈ సంఖ్య పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒంటరితనం వృద్ధులను మరింత బలహీనులను చేస్తున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం వృద్ధులలో 70 శాతం మందికి కనీసం ఒక దీర్ఘకాలిక వ్యాధి ఉంటుంది. డయాబెటిస్, హైబీపీ, హృద్రోగాలు, మతిమరుపు వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. చికిత్స ఖర్చులు అధికం అవుతాయి. కానీ వారిని చూసుకోవాల్సిన పిల్లలు తమ జీవితాల్లో బిజీగా ఉండి పట్టించుకోవడం లేదు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి నగరాల్లో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఒకప్పుడు వృద్ధాశ్రమం అన్నది అత్యంత అరుదైనది. ఇప్పుడు మాత్రం ప్రతీ ప్రాంతంలో ఒకటి రెండు కనిపిస్తున్నాయి. అక్కడ ఉన్నవారి కథలు వినిపిస్తే కన్నీళ్లు రాక మానవు. నలుగురు పిల్లలు ఉన్నా వారెవరూ చూడలేక, చివరికి వృద్ధాశ్రమం చేరిన తల్లులు, తండ్రులు తమ బాధను కన్నీటి రూపంలో చెబుతుంటారు. "డబ్బు పంపిస్తారు, కాని ఆప్యాయత మాత్రం దొరకదు" అనే వాక్యం చాలామందికి నిత్యజీవితం.

చట్టపరంగా చూస్తే భారత రాజ్యాంగంలో వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ఆర్టికల్ 41 ప్రకారం వృద్ధులకు సహాయం చేయడం రాష్ట్ర బాధ్యత. ఆర్టికల్ 46 ప్రకారం బలహీన వర్గాలను రక్షించాలి. అంతేకాక 2007లో వచ్చిన %మీుఱఅ్వఅఋఱఅవ ఖఅ ఔవశ్రీటఋతీవ శీట ్ఞుతీవఅ్ం ఖఅ ావఅఱశీతీ జఱఅఓవఅం చాష్% ప్రకారం పిల్లలు తల్లిదండ్రులను పోషించాల్సిందే. కానీ ఆ చట్టం అమలు చాలా బలహీనంగా ఉంది. వృద్ధులు కోర్టుల చుట్టూ తిరగలేరు. చాలామందికి ఆ చట్టం గురించి అవగాహన కూడా లేదు. ఇక్కడే రేవంత్ రెడ్డి ప్రతిపాదన ప్రత్యేకతను సంతరించుకుంది. కోర్టులో కేసు వేయనవసరం లేకుండా నేరుగా వేతనాల్లో కోత విధించడం వల్ల ఫలితం తక్షణమే వస్తుంది.

ఈ ప్రతిపాదనపై సమాజంలో మిశ్రమ స్పందనలు వచ్చాయి. చాలా మంది ప్రజలు దీనిని స్వాగతించారు. వృద్ధుల జీవన భద్రత కాస్త పెరుగుతుందని, పిల్లలకు తల్లిదండ్రుల పట్ల కనీస బాధ్యత గుర్తు చేస్తుందని అనుకూల వర్గం అభిప్రాయపడుతోంది. వృద్ధాశ్రమాలపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గుతుందని భావిస్తున్నారు. అయితే కొందరు మాత్రం దీనిని విమర్శిస్తున్నారు. ప్రేమను బలవంతం చేయలేమని, కుటుంబ సంబంధాల్లో ప్రభుత్వం జోక్యం అవసరం లేదని వాదిస్తున్నారు. తల్లిదండ్రులే కొన్నిసార్లు తప్పు చేసిన సందర్భాలు ఉంటాయని, అప్పుడు కూడా పిల్లల జీతంలో కోత వేయడం సరికాదని అంటున్నారు. కానీ మొత్తం మీద సమాజంలో మద్దతే ఎక్కువగా కనిపిస్తోంది.

ఇతర దేశాల్లో పరిస్థితిని పరిశీలించినా, ఇలాంటి చట్టాలు ఉన్నాయని తెలుస్తోంది. చైనాలో తల్లిదండ్రులను తరచూ చూడకపోతే శిక్షించే చట్టం ఉంది. సింగపూర్‌లో కోర్టు ఆదేశిస్తే పిల్లలు తప్పనిసరిగా తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేయాలి. అమెరికా, యూరప్ దేశాల్లో వృద్ధులు ఎక్కువగా ప్రభుత్వ పెన్షన్లు, ఆరోగ్య బీమా, సీనియర్ సిటిజన్ హెూమ్స్‌పై ఆధారపడతారు. కానీ అక్కడ కూడా వృద్ధుల ఒంటరితనం ఒక పెద్ద సమస్యే. భారతదేశం మాత్రం కుటుంబ విలువల ఆధారంగా నిలిచే దేశం. కానీ ఇప్పుడు ఆ విలువలు బలహీనపడుతున్నందున ఇలాంటి చట్టాలు అవసరమవుతున్నాయి.

ఈ ప్రతిపాదన వృద్ధుల జీవితాల్లో ఆర్థిక భద్రతను మాత్రమే కాదు, మానసిక బలం కూడా ఇస్తుంది. పిల్లలపై పూర్తిగా ఆధారపడకోవడం వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతుంది. కుటుంబాల్లో విలువలు, బంధాలు పునరుద్ధరించబడతాయి. ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగులపై కూడా ఈ చట్టం అమలైతే విస్తృత ప్రయోజనం ఉంటుంది. హైదరాబాద్ IT రంగంలో లక్షలాది మంది యువత పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి నగరాల్లో స్థిరపడ్డారు. వారి తల్లిదండ్రులు గ్రామాల్లో ఒంటరిగా ఉంటున్నారు. ఈ ప్రతిపాదన ప్రైవేట్ రంగానికి వర్తిస్తే, ఆ వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుంది.

వరంగల్‌లోని ఒక వృద్ధ రైతు తన అనుభవాన్ని ఇలా చెప్పాడు: "నా కొడుకు నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. మందుల ఖర్చు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం నేరుగా కోత విధిస్తే కొంత సాయం లభిస్తుంది." హైదరాబాదులో వృద్ధాశ్రమంలో ఉన్న ఒక మాజీ ఉపాధ్యాయురాలు కన్నీటి కళ్లతో చెబుతూ %–% "నాకు నలుగురు పిల్లలు ఉన్నారు. అందరూ విదేశాల్లో ఉన్నారు. నాకు ఒక్కరైనా దగ్గర ఉంటారని అనుకున్నాను. కానీ ఇక్కడ వృద్ధాశ్రమంలో ఉన్నాను. ప్రతీ నెల కొంత డబ్బు పంపిస్తారు. కానీ ఆప్యాయత మాత్రం దొరకదు." ఈ ఉదాహరణలు ఈ చట్ట ప్రతిపాదన అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి.

భవిష్యత్తులో ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చితే, ఇది ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారవచ్చు. పాఠశాల స్థాయి నుంచే తల్లిదండ్రుల గౌరవం అనే విలువను బోధించాలి. వృద్ధుల కోసం ఆరోగ్య పథకాలు, పెన్షన్ వ్యవస్థలు మరింత బలంగా ఉండాలి. సమాజంలో నైతిక బాధ్యతను పెంచేలా అవగాహన కార్యక్రమాలు అవసరం. చట్టం ఒకవైపు సహాయం చేస్తే, మనసులో మార్పు మరోవైపు జరగాలి.

ముగింపుగా చెప్పాల్సిందల్లా ద– భారతీయ సంస్కృతి పునాది తల్లిదండ్రుల గౌరవం. కానీ ఆధునిక సమాజంలో అది క్షీణిస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన ఈ సమస్యను ముందుకు తెచ్చింది. జీతంలో కోత విధించడం కఠినమైన చర్య అనిపించినా, వృద్ధుల సంక్షేమం దృష్ట్యా ఇది అవసరమైనదే. నిజమైన మార్పు కోసం చట్టాలకంటే మన మనసులోని విలువలు మేల్కొనాలి. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, కృతజ్ఞత, గౌరవం – ఇవే ఈ సమాజాన్ని మానవీయంగా నిలుపుతాయి. "మాతృ దేవోభవ, పితృ దేవోభవ" అనే వాక్యం పుస్తకాలలో మాత్రమే కాకుండా మన జీవితంలో ప్రతి క్షణం ప్రతిఫలించినప్పుడే ఈ సంస్కృతి నిజంగా సజీవంగా ఉంటుంది.

# రాజస్థాన్ రాజధాని జైపూర్లో జరిగే ఏబిఆర్ఎస్ఎం సమావేశాలకు బయలుదేరిన తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి పూజరి రమేశ

**మంచాల వెలుతురు అక్టోబర్ 5:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన పూజరి రమేశ (తపస్)రంగారెడ్డిజిల్లా ప్రధానకార్యదర్శి తపస్ నారాయణపేట్ బృందంతో కలిసి ఆదివారం రోజు నుండి మూడురోజుల అక్టోబర్ 05.06.07 తేదీలలో పాటు రాజస్థాన్ రాజధాని జైపూర్ లోజరిగే అఖిల భారతీయ శైక్షిక్ మహా సంఘ్ ఏబిఆర్ఎస్ఎం కు అనుబంధం సంస్థ తపస్ జాతీయ సమావేశాలకు ఆదివారం రోజు శంషాబాద్ విమానాశ్రయం నుండి బయలు దేరి వెళ్ళడం జరిగింది ఈ సందర్భంగా తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈసమావేశాల్లో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు జాతీయ



భావాల పెంపు ఆవశ్యకత మరియు దేశాన్ని ఉన్నత స్థాయిలో నిలపడంకోసం టీచర్లు నిర్వహించాల్సిన కార్యక్రమాలు చెయ్యాల్సిన కృషి మరియు తదితర అంశాలపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఉపాధ్యాయులు మరియు అధ్యాపకులచే సంఘ ప్రతినిధులు ఈ సమావేశాల్లో చర్చిస్తారని అన్నారు ఇప్పటికే ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుండి తపస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కానుగంటి హనుమంతరావు నవాత్ సురేష్ రంగారెడ్డి జిల్లా నుండి ఏబిఆర్ఎం బాధ్యులువిష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ నారాయణపేట్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేర్ కృష్ణరెడ్డినరసింహ జిల్లా బృందం రవీందర్, కిషోర్ కుమార్ మల్లికార్జున్ లతో పాటు దాదాపు 170మంది కి పైగా తపస్ రాష్ట్ర, జిల్లా ముఖ్యమైన మండల బాధ్యులు మరియు మహిళా కార్యకర్తలు జైపూర్ వెళ్ళారు

# మంచాలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

**- స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, సిద్ధం కావాలి**

**- మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి**

మంచాల వెలుతురు అక్టోబర్ 5:
మంచాల మండలం తాళ్లపల్లి గూడ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది ఈకార్యక్రమానికి వివిధ గ్రామాల ముఖ్య నాయకులు హాజరయ్యారు ఈ సందర్భంగా మండలం అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు గురించి ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జడ్పిటిసి ఎంపీటీసీ అభ్యర్థులుగా ఎవర్ని ప్రకటించిన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మన ప్రియతమ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో మన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి



ప్రతిగడపకు వెళ్లి వివరించాలి అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త కృషి చేయాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మంచాల సొసైటీ బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్ కె వెంకటేశ్వర్ రెడ్డి మంచాల సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ వేణుగోపాలరావు మాజీ ఎంపీటీసీలు ఎడ్మ నరేందర్ రెడ్డి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ రాందాస్ నాయక్, మంచాల మండలం మాజీ కోఆప్షన్ నెంబర్ మహమ్మద్ వాజిద్ మాజీ మండల అధ్యక్షుడు గుండెమోని మల్లేష్ ముదిరాజ్ మాజీ సర్పంచ్ లుసుంకరి పాండ రీనాథ్ గౌడ్ పాతులోతు శ్రీనివాస్ నాయక్ సపవట్ శ్రీధర్ నాయక్ జెలామోని సత్తయ్య ముదిరాజ్ బైరక రమాకాంత్ రెడ్డి పెరిక మూర్తి గౌరిగే వీరేశం గౌడ్ మోహన్ నాయక్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి నాయకులు కొర్రమోతి రాంనాయక్, లొంగారి మల్లేష్, ఓరిగంటి లింగం గౌడ్, వట్టి యాదయ్య బాలశివుడు గౌడ్ జనార్దన్ నాయక్, రాజునాయక్ చెరుకూరి జంగయ్య, జేనిగే కొమురయ్య గజ్జి ఐలయ్య గణేష్ యాదవ్ జిలమోని పాండు ముదిరాజ్, జైపాల్ రెడ్డి, గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మెగావత్ లక్ష్మణ్ నాయక్ మార సురేష్ రాజేష్ కిషన్ నాయక్ విక్రమ్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ శివ యాదవ్ శ్రీకాంత్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# దేశ వైభవమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

## (100ఏళ్లు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలకు చేరుకున్న సంఘ్)




*ఆర్ఎస్ఎస్.... ఈ మూడక్షరాలు వినని వారు ఉండరేమో!! నేడు దేశములోనూ, విదేశాలలోనూ అందరికి ఒక ఆసక్తికర అంశంగా, స్ఫూర్తికేంద్రంగా ఆర్ఎస్ఎస్ మారింది అనటంలో అతిశయోక్తి అక్కర్లేదు. పత్రికల్లో విజయాలుగా, వివాదాలుగా ఆర్ఎస్ఎస్ వార్తలు వస్తూనే ఉన్నాయి. మేధావులు, రాజకీయవేత్తలు సంఘ్ గురించి చర్చిస్తూనే ఉన్నారు. ఇటీవల యువత ఎక్కువగా ఆకర్శింపబడుతోంది. వివిధ సాంప్రదాయ మఠాధిపతులు, వివిధ సామాజిక రంగాల ప్రముఖులు సంఘ్ తో అనుబంధం కొనసాగిస్తున్నారు. గతంలో భారతీయ ముస్లిం సమాజం కోరిక మేరకు సంఘ్ అధినేత ఏకంగా ఢిల్లీ లో ఓ మసీదు, ఓ మదర్సా ని సందర్శించి జాతీయవాద శక్తిని ప్రదర్శించటం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు ఆర్.ఎస్.ఎస్. మతోన్మాద సంస్థగా చిత్రీకరించే శక్తులకి సంఘ్ స్థాపన ఉద్దేశ్యం, సంఘ్ లక్ష్యం స్పష్టంగా తెలియదనే చెప్పవచ్చు. రాబోయే విజయదశమి నాటికి 100 ఏళ్ళు పూర్తయి శతజయంతి ఉత్సవాలకు చేరువవుతున్న ఆర్ఎస్ఎస్ ప్రస్థానం సమాజోన్నతి కోరే ప్రతి సంస్థకు ఆదర్శం.*

### ఆర్ఎస్ఎస్ స్థాపన ఉద్దేశ్యం

సంఘ్ స్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ పూర్వీకులది తెలంగాణ ప్రాంతమే. వారు ఆనాటి కాంగ్రెస్ లోను, విప్లవ సంస్థల్లోనూ, స్వతంత్ర్యోద్యమంలోను పాల్గొన్నారు. చరిత్ర అధ్యయనంలో డాక్టర్ హెడ్గేవార్ తెలుసుకున్న విషయం ఏమిటంటే 'భారత దేశ సమస్యలకు మన సమాజంలో ఉన్న అనైక్యతా మరియు ఆత్మవిస్మృతి ల లోపమే ప్రధాన కారణం'. విదేశీయుల దాడుల్లో ధర్మసంస్కృతుల విఘాతానికి కారణం ఇక్కడి మూల హిందూసమాజ అనైక్యతా ,ఆత్మవిస్మృతి లే అని డాక్టర్జీ నిర్ధారించారు. మనలోని లోపాలను నిర్మూలించి, మన సమాజంలో జీవన విలువలను నింపాలని చెప్పేవారు. సామాజిక స్పృహ, జాతీయ భావన, సంఘటిత దృష్టి, కఠోర పరిశ్రమ, నిస్వార్థం, తోటివారి పట్ల ప్రేమ కలిగి ఉండటంబీ ఈర్ష్య, ద్వేషం లేకుండటం వంటి గుణాల నిర్మాణం వలనే మన దేశం సుఖంగా, వైభవంగా జీవించ గలుగుతుంది అనేది వారి స్పష్టమైన అవగాహన. ఇలాంటి గుణాలు కల వ్యక్తుల నిర్మాణం కోసమే ఆర్.ఎస్.ఎస్. 1925 విజయదశమి నాడు నాగ్ పూర్ మెహితే వాడ లో ప్రారంభం అయింది.

'హిందూ సమాజం ఐక్యమైతే ఏం చేయగలదు ? అని ఎవరైనా ప్రశ్నిస్తే, 'సమాజం ఐక్యమైతే చేయలేనిది ఏముంటుంది ? ఏదైనా చేయగలదు' అని ఆత్మ విశ్వాసంతో చెప్పుండేవారు. అంతే కాకుండా ఆర్.ఎస్.ఎస్. ఏ మతానికి వ్యతిరేఖం కాదని, హిందూ సంస్కరణ అవసరం అని ఆయన భావించాడు. హిందుత్వాన్ని అర్థం చేసుకోని వారు సంఘాన్ని అర్థం చేసుకోలేరు.

### జాతిని సంఘటితం చేసే కార్యం

దేశ విభజనకుట్రను దేశభక్తి గల నాయకులు గమనించలేక పోతున్న తరుణంలో డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గేవార్ ఆత్మ విశ్వాసంతో, దూరదృష్టితో ఆర్ఎస్ఎస్ అనే దారిదీపంతో మన జాతి ఆత్మను మేల్కొలిపి, జాతిని సంఘటిత (ఐక్యత) పరిచే శాశ్వత కార్యాన్ని ముందుంచారు. 1925 లో ప్రారంభించబడిన ఆర్ఎస్ఎస్ జాతి ఐక్యతే లక్ష్యంగా నేటికీ ముందుకు సాగుతోంది. రాజకీయాలకు అతీతంగా ఆర్ఎస్ఎస్ హిందూ సమాజ సంఘటన కార్యానికి శ్రీకారం చుట్టింది. ప్రతి రోజు ఒక గంట "శాఖ"కార్యం ద్వారా సమాజహితం గురించి ఆలోచించే వ్యక్తులు దేశం నలుమూలలనుంచి కావాలని ఆర్.ఎస్.ఎస్ లక్ష్యం. తద్వారా దేశమంతట దేశహితం గురించే ఆలోచించే వ్యవస్థ నిర్మాణమై అదే ఈ దేశానికి శ్రీరామరక్ష కావాలి. ఈరోజున దేశమంతటా హిందుత్వ ఆలోచనలు సాకార రూపంలో మనకు కనబడుతున్నాయి. ధృడమైన జాతీయ భావాల నిర్మాణం కారణంగా నేడు ఏళ్ల తరబడి ఉండిపోయిన కాశ్మీర్ సమస్య, రామ జన్మభూమి మందిర నిర్మాణ సమస్య, తీవ్రవాద సమస్యలు, దేశ వ్యతిరేఖ కార్యకలాపాలు .... ఇలా ఎన్నింటికో పరిష్కారం చూపబడింది.

### ఆర్ఎస్ఎస్ లక్ష్యం

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలో అగ్రగామి దేశంగా చూడటమే ఆర్.ఎస్.ఎస్.లక్ష్యం. దీనినే ప్రతిరోజు"పరమ్ వైభవన్ నేతు మేతత్ స్వరాష్ట్రమ్(సంస్కృతం లో రాష్ట్రము అంటే జాతి) అంటూ స్వయంసేవకులు శాఖల్లో జరిగే ప్రార్థన లో గుర్తు చేసుకుంటారు. హిందూరాష్ట్ర పరమవైభవాన్ని సాధించటం సంఘలక్ష్యం. ప్రతి మనిషి కూడు,గూడు, గుడ్డ,విద్య,ఆరోగ్యం , సంస్కారం కలిగి ఉండటం పరమ వైభవ స్థితి. ఈ క్రమంలో వ్యక్తిని వికసింపజేసే దిశలో సంఘం ఆలోచిస్తుంది. వ్యక్తులు స్వావలంబనతో పై వన్నీ సంపాదించుకోగలుగుతారు. అయితే వీటన్నింటికి ఆలంబన "ధర్మం". ధర్మ అనుష్టాన వ్యక్తి నిర్మాణం, ధర్మాధారిత సమాజ నిర్మాణం సంఘ లక్ష్యం.

### హిందుత్వమే సంఘ్

హిందూ ఆలోచన విధానం విశాలమైనది. హిందుత్వం సమన్వయ మార్గం. హిందూత్వంలో విద్వేషం లేదు. హిందుత్వం మత వాచకం కాదు. హిందూ భావధార మతతత్వం కానే కాదు. హిందూత్వంలో అన్నింటిని కలుపుకొనే శక్తీ ఉంది. హిందూత్వంలో సకల ప్రాణి కోటిని ఆరాధించే సంస్కృతి ఉంది. సంపూర్ణ మానవాళి శ్రేయస్సు హిందుత్వతోనే సాధ్యం. ఆరాధనా పద్ధతులు దేశంలో వేర్వేరు ఉండవచ్చు. జాతీయతకి వచ్చేసరికి దేశంలోని అందరి మూలం ఒక్కటే. అందరిలోని డిఎన్ఏ ఒక్కటే. యూదు, పార్సీ జాతులు వచ్చి ఇక్కడి హిందుత్వలో కలిసిపోలేదా? ఇక్కడి జాతీయులం అని భావించట్లేదా? ప్రత్యేక ఉనికి లేకుండా స్వేచ్ఛగా, ఆనందంగా వారు ఇక్కడ బతుకుతున్నారు. దానికి కారణం హిందుత్వం కాదా!? ఎటొచ్చి క్రైస్తవ, ఇస్లాం అనుసరించే కొందరు మతాన్ని మాత్రమే పట్టుకొని దేశం పట్ల విధేయత విషయంలో సందేహాస్పదంగా జీవించొద్దని సంఘ్ కోరుకొంటుంది. సంఘ్ ప్రారంభంలో డాక్టర్ హెడ్గేవార్ ఉద్దేశ్యాలే నేటికి కొనసాగింపబడటం విశేషం. సంఘ్ ప్రతి పనికి దేశం- హిందుత్వమే గీటురాయి. అది గో సంరక్షణ అయిన, గ్రామం వికాసం అయినా, సామాజిక సమరసత అయినా, పర్యావరణ పరిరక్షణ అయినా, ధర్మ జాగరణ అయినా, కుటుంబ ప్రబోధమే అయినా... ఆధారం హిందుత్వమే.


### సంఘ్ ప్రవాహం అప్రతిహతం

నేడు దేశంలో డెబ్భైవేలకు పైగా గ్రామాలలో ఆర్ఎస్ఎస్ శాఖలు ఉన్నాయి ,రాబోయే కొద్ది రోజుల్లోనే లక్ష గ్రామాలకు చేరుకోవాలనేదే ఆర్ఎస్ఎస్ లక్ష్యం. సేవా భారతి పేరుతో స్వయంసేవకుల ద్వారా దేశ వ్యాప్తంగా లక్ష యాభై వేల కు పైగా సేవా కార్యక్రమాలు జరుపబడుతున్నవి. . హిందూ సమాజంలో మనమందరం ఒకేజాతివారం అనే భావన నిర్మాణం కావాలి. హిందుత్వం జీవన విధానంగ, ప్రపంచానికే ఒక సమన్వయ మార్గంగా మహాపురుషులు అందించారు. హిందుత్వాన్ని మత కోణంలో, రాజకీయ కోణంలో ఆలోచించినంత వరకు ఆర్ఎస్ఎస్. ని అర్థం చేసుకోలేము. ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవాలంటే ఒక 6 నెలలు సంఘం లో కి వచ్చి పనిచేయ్యండి అని ప.పూ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ జీ చెప్పారు. సామాజిక కోణంలో,తాత్విక దృష్టితో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే అన్ని సమస్యలకు హిందుత్వమే మార్గం చూపిస్తుంది.

**- భారతీ**

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

## - నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ వెలుతురు అక్టోబర్ 05:** స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కోడ్ ముగిసే వరకు ప్రతి సోమవారం ఫిర్యాదులు ఇవ్వడానికి ప్రజలు రావద్దని విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి బీజేపీలోకి 30 మంది యువకులతో కలిసి చేరిక

## - మోడీ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావంతో పార్టీలో చేరిన యువజనం...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:** సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం ఖలీల్పూర్ గ్రామంలో రాజకీయ ఉత్సాహం నెలకొంది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్దబాయి కృష్ణారెడ్డి, తన అనుచరులైన 30 మంది యువకులతో కలిసి ఆదివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ కార్యక్రమం బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ తదితర నేతలు ఈ కార్యక్రమానికి హాజరై, కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, యువకులకు కండువాలు కప్పి ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా పెద్దబాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ..."ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి కార్యక్రమాలు, దేశాన్ని ముందుకు తీసుకెళ్లే నాయకత్వం మాకు ప్రేరణ కలిగించాయి. మా గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి నేను నిబద్ధంగా పని చేస్తాను," అని చెప్పారు.(అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాలను సాధించి, అధికారాన్ని నిలబెట్టుకుంటుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# జహీరాబాద్ బీజేపీకి షాక్...కీలక నేతలు బీఆర్ఎస్ గూటికి





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. న్యాల్కల్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ పాండు రంగా రావ్ పాటిల్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజోల్, మరియంపూర్, గణేష్పూర్ గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 35 మంది బీజేపీ నాయకులు మాజీ మంత్రి హరీశ్ రావు మరియు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు ల సమక్షంలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్లో చేరారు.

బస్వరాజ్ పాటిల్, మల్లప్ప, వీర్శెట్టి, రాజు, జరెప్ప వంటి ప్రముఖులు ఈ చేరికలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, అప్పారావ్ పాటిల్, దేవదాస్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### "బీఆర్ఎస్ గెలుపే నిశ్చితం" - హరీశ్ రావు:

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, "ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా జడ్పీ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో గులాబీ జెండా ఎగురుతుంది. జహీరాబాద్ నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థాయిలలో బీఆర్ఎస్ విజయగర్జన వినిపిస్తుంది" అన్నారు.

### కాంగ్రెస్ - బీజేపీ రెండు దొందూ దొందే:

"తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటే. ఒకదానికి మోస చరిత్ర ఉంటే, మరొకదానికి ద్రోహ చరిత్ర ఉంది. 'చోటా భాయ్ - బడే భాయ్' ఇద్దరినీ నమ్మడం మానుకోవాలి," అంటూ ప్రజలకు హెచ్చరికలు చేశారు.

### బీజేపీ హామీలు ఎక్కడికిపోయాయి?

"రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు, ఏమైంది? నల్లధనం తెచ్చి రూ.15 లక్షలు ఇస్తామన్నారు, దానికో పేరు లేదు గౌరవం లేదు. గ్యాస్ సిలిండర్ ధర రూ. 350 నుంచి రూ. 1,200కి పెరిగింది. పెట్రోల్ రూ. 65 నుంచి రూ. 100 దాటింది. జీఎస్టీతో సామాన్యుడి పై భారమే మిగిలింది," అంటూ బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు.

### రైతులపై కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ విఫలం:

"యూరియా కోసం రైతులు లైన్లలో పడే పరిస్థితి ఏనాడైనా చూశామా? కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విఫలమైంది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ రైతుల పట్ల చిన్నచూపే చూపుతున్నారు," అని అన్నారు.

### కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి రక్ష:

"తెలంగాణను తన ప్రాణంగా భావించిన నాయకుడు కేసీఆర్ గారు మాత్రమే. ఆయన నేతృత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష. కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ప్రజలను నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచుతున్నాడు" అని విమర్శించారు.

### కార్యకర్తలకు మాజీ మంత్రి హరీష్ రావు పిలుపు:

"బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ గ్రామస్థాయిలోనుంచి కృషి చేసి, గెలుపు సాధించాలి. ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ మోసాలు వివరించి, మళ్లీ గులాబీ జెండాను ఎగురవేయాలి" అని హరీశ్ రావు పిలుపునిచ్చారు.

# మొగుడంపల్లి మండల కాంగ్రెస్ నేతలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

## మాజీ మంత్రి, జహీరాబాద్ ఇంచార్జ్ డా.. ఏ.చంద్రశేఖర్....



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగడం పల్లి మండల కేంద్రంలోని ఆజాన ఫంక్షన్ హాల్ లో మాజీ మంత్రి డా??ఏ.చంద్రశేఖర్ అధ్యక్షతన మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం, రానున్న స్థానిక సంస్థల ఎంపీటీసీ,జడ్పీటీసీ, ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశావాహుల పేర్లను మండల కాంగ్రెస్ కమిటీకి అందిస్తే వారు మాజీ మంత్రి డా??.చంద్రశేఖర్ ద్వారా జిల్లా పార్టీ అధిష్టానానికి పంపడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైతే సుదీర్ఘకాలంగా పార్టీ నమ్ముకొని కష్టకాలంలో పార్టీని విడాకుండా,పార్టీయే ప్రాణంగా నమ్ముకొని ఉన్నారో వారికే మాత్రమే టికెట్లు కేటాయించి, అన్ని స్థానాలను గెలుచుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలను సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఇండస్ట్రియల్ ఛైర్మెన్ తన్వీర్, మండల అధ్యక్షులు మహమ్మద్ మాక్సూద్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ అశోక్, కాంగ్రెస్ నాయకులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రామయపల్లి గ్రామంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం నూతన విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు జోరుగా బోనాల పండుగకు ముస్తాబు



**మనోహరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామయపల్లి గ్రామంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, హోమము, బోనాలు, అలంకరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రామయపల్లి గౌడ సంఘం సభ్యులు సీనియర్ జర్నలిస్ట్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకటోల్ల శివ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటోల్ల పండు గౌడ్, గౌడ సంఘం నాయకులు వెంకటోల్ల రాజు, జట్టు సత్యనారాయణతో పాటు సుమారు 80 మంది గౌడ సంఘం సభ్యులు సమావేశమై వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ నవంబర్ నెలలో రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, బోనాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొననుందని, గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

# రామకృష్ణ కాలనీలో ఘనంగా ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్....

## ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా దేశ, సమాజసేవ, జాతిని సంఘటితం చేసే కార్యం కోసం పనిచేస్తుంది

## ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ జి...

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 05:** డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గేవార్ ఆత్మ విశ్వాసంతో, దూరదృష్టితో ఆర్.ఎస్.ఎస్. అనే దారిదీపంతో మన జాతి ఆత్మను మేల్కొలిపి, జాతిని సంఘటిత (ఐక్యత) పరిచే శాశ్వత కార్యాన్ని ముందు ఉంచారని, 1925 లో ప్రారంభించబడిన ఆర్.ఎస్.ఎస్ జాతి ఐక్యతే లక్ష్యంగా, సమాజ, దేశ సేవ కోసం 100 సంవత్సరాలుగా పనిచేస్తూ ముందు కొనసాగుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ జి అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రోజున తిమ్మాపూర్ ఖండ ఆధ్వర్యంలో రామకృష్ణ కాలనీ ఏరియాలో పథ సంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య వక్తక హాజరైన భానుచందర్ జి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆర్.ఎస్.ఎస్. హిందూ సమాజ సంఘటన కార్యానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి రోజు ఒక గంట "శాఖ"కార్యం ద్వారా సమాజహితం గురించి ఆలోచించే వ్యక్తులు దేశం నలుమూలలనుంచి తయారు కావాలని సంకల్పంతో ఆర్.ఎస్.ఎస్ ఇన్నేళ్లుగా పనిచేస్తుందన్నారు. . దేశమంతట దేశహితం గురించే ఆలోచించే వ్యక్తులతో వ్యవస్థ నిర్మాణమైతే అదే ఈ దేశానికి శ్రీరామరక్ష అవుతుందని, అలాంటి పనే ఆర్ఎస్ఎస్ చేసిందన్నారు. ఆర్ఎస్ఎస్ ధృడమైన జాతీయ భావాల నిర్మాణం కారణంగా నేడు ఏళ్ల తరబడి ఉండిపోయిన కాశ్మీర్ సమస్య, రామ జన్మభూమి మందిర నిర్మాణ సమస్య, తీవ్రవాద సమస్యలు, దేశ వ్యతిరేఖ కార్యకలాపాలు .... ఇలా ఎన్నింటికో పరిష్కారం చూపబడిందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలో అగ్రగామి దేశంగా చూడటమే ఆర్.ఎస్.ఎస్.లక్ష్యన్నారు . దీనినే ప్రతిరోజు"పరమ్ వైభవన్ నేతు మేతత్ స్వరాష్ట్రమ్(సంస్కృతం లో రాష్ట్రము అంటే జాతి) అంటూ స్వయంసేవకులు శాఖల్లో జరిగే ప్రార్ధన లో గుర్తు చేసుకుంటారని తెలిపారు. హిందూరాష్ట్ర పరమవైభవాన్ని సాధించటం సంఘలక్ష్యమన్నారు. ప్రతి మనిషి కూడు,గూడు,గుడ్డ,విద్య,ఆరోగ్యం , సంస్కారం కలిగి ఉండటం పరమ వైభవ స్థితి అని, ఈ క్రమంలో వ్యక్తిని వికసింపజేసే దిశలో సంఘం నిరంతరం ఆలోచిస్తుందన్నారు. అనంతరం ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ ఆర్మీ మాజీ సైనికులు శ్రీధర్ జి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ను దేశభక్తుల ఆర్మీగా అభివర్ణించారు..

దేశ రక్షణ కోసం సైనికులు పనిచేస్తుంటే, మాతృభూమి సేవ కోసం స్వచ్ఛందంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ను స్థాపించిన డాక్టర్ జి దూరదృష్టి, ఆలోచన విధానాలతో నేడు అతిపెద్ద జాతీయవాదా సంస్థగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సద్భావన ప్రముఖ్, కొండేటి బాలరాజ్ జి, జిల్లా కార్యవహ గుత్తికొండ రాజశేఖర్ జి, జిల్లా శరీరక్ ప్రముఖ్ కాముటం వినీత్ జి, జిల్లా సేవా ప్రముక్ సంపత్ జి, తెలంగాణ ప్రాంత సామజిక సమరసత సహ కార్యకరిని పుల్లూరి రామారావు , ఖండ కార్యవహ ఆవుల కుమార్ జి, ఎడ్ల భూమిరెడ్డి , నర్సింగరావు జి , ఖండ కార్యకరిని, ఉపమండల ప్రముఖ్ లు, చిగురుమామిడి, గన్నెరువరం, తిమ్మాపూర్ స్వయం సేవక్ లు పాల్గున్నారు














# కరీంనగర్లో ఘనంగా ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్...

## నగరంలోని పలు ప్రాంతాల మీదుగా స్వయంసేవకుల భారీ కవాతు.

## పంచ పరివర్తన్ లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

## ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవహ కాచం రమేష్ జి...

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 05:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం కరీంనగర్లో పథ సంచాలన్ నిర్వహించింది. కరీంనగర్ లోని పలు ప్రాంతాల మీదుగా సాగిన రూట్ మార్చ్ లో భారీ ఎత్తున పాల్గొని టిటిడి కళ్యాణమండపం వరకు కవాతు నిర్వహించారు. అనంతరం టిటిడి కళ్యాణమండపం లో జరిగిన సమావేశానికి తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి ముఖ్యఅతిథిగా హాజరై స్వయం సేవకులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా, సమాజ, దేశ సేవ లక్ష్యంగా డాక్టర్ కేశవ్ రావు బలి రామ్ పంత్ హెడ్గేవార్ (డాక్టర్ జి) ఆర్ఎస్ఎస్ సంస్థను మహారాష్ట్రలోని నాగపూర్ లో 1925 న విజయదశమి రోజున అతి చిన్న వయసు కలిగిన పదిమంది పిల్లలతో ప్రారంభించారని తెలిపారు. అలాంటి ఆర్ఎస్ఎస్ నేడు కోట్లాదిమంది స్వయం సేవకులను కలిగి , దేశ,సమాజ సేవలో అత్యంత ప్రభావిత సంస్థగా మారిందన్నారు. ఈ విజయదశమి కి ఆర్ఎస్ఎస్ 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నా శుభ సందర్భంలో శతజయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. వందేళ్ల దిగ్విజయంగా పూర్తి చేసుకున్న అతిపెద్ద జాతీయవాద సంస్థ గా ఆర్ఎస్ఎస్ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. . ఒకనాడు మహారాష్ట్రకే పరిమితమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాలకు విస్తరించిందనీ చెప్పారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ కు సర్ సంఘ చాలకులుగా పనిచేసిన ఎంతోమంది పెద్దలు ఆర్ఎస్ఎస్ ను ఒక మహా వృక్షం మాదిరిగా యావత్ భారతదేశం అంతటా విస్తరించడానికి తమ జీవితాలను ధార పోశారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ పుట్టిందే మాతృభూమి సేవ కోసమన్నారు. హైందవాన్ని ఒక మతంగా కాక ఒక జీవన విధానంగా, భారత ప్రజలను భరతమాత రూపంగా భావించి , భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల కోసం , దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడం కోసం , సమాజసేవ కోసం కోట్లాది స్వయం సేవకులు నిరంతరం పనిచేస్తు, నిస్వార్ధ సేవ లక్ష్యంతో ముందుకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు పంచ పరివర్తన్ లక్ష్యం దిశగా కొనసాగుతున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా ఐదు అంశాలను స్వయం సేవకులు ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక పవర్ హౌస్ లాంటిదని , ఒక పవర్ హౌస్ నుండి కరెంటు దేశంలోని అన్ని అవసరాలకు ఎలా ఉపయోగపడుతుందో ... ఆర్ఎస్ఎస్ కూడా అదేవిధంగా దేశం కోసం ఉపయోగపడే పని చేస్తుందన్నారు. ముఖ్యంగా వ్యక్తి సరైన వాడైతే సమాజం కూడా సరైన దిశలో ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రధానంగా సంఘం నిర్వహించే శాఖ పద్ధతి ద్వారా వ్యక్తి నిర్మాణాన్ని చేస్తుందనీ, గంటసేపు శాఖలో జరిగే వివిధ కార్యక్రమాల తో వ్యక్తి వికాసం కోసం కృషి చేస్తుందన్నారు. . హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, దేశాన్ని ప్రపంచంలోనే గురువు స్థానంలో ఉంచాలనే సంకల్పంతో ఆర్ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలిపారు.







# “నర్సింహారెడ్డి సస్పెండ్ కాలేదు.. క్లారిటీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు!”






**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి సస్పెండ్ అయ్యారనే తప్పుడు వార్తలతో అసంతృప్తికి లోనైన కార్యకర్తలకు శనివారం ఊరట లభించింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర నేతలు డా. సిద్దం ఉజ్వల్ రెడ్డి, మహ్మద్ తన్వీర్ మొదలైన వారు స్పందిస్తూ “పి. నర్సింహారెడ్డి సస్పెండ్ కాలేదు, ఆయనే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు” అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రకటనతో జహీరాబాద్ మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఉదయం కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నర్సింహారెడ్డిని శాలువాలతో సత్కరించారు. విజయోత్సవ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ భీమయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అక్బర్, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, ఇమామ్ పటేల్, నర్సింహులు, జగన్మోహన్, సుభాష్ రెడ్డి, సామ్సన్, వీరన్న, సోమప్ప, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా

- స్థానిక సంస్థల ఎన్నికల విధులలో అధికారులు
- కేవలం హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ వెలుతురు అక్టోబర్ 05:**
స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా వాయిదా వేయడం జరిగిందని, కేవలం హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తామని ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని సహకరించాలన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కేశవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీవో ముందడుగు

- రామయ్యపల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో మొక్కలు నాటిన సీనియర్ జర్నలిస్ట్ శివ గౌడ్



**మనోహరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలోని రామయ్యపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పచ్చదనం పెంపుదలకు నాంది పలుకుతూ ఈతమొక్కల నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, కేశవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీవో అధ్యక్షులు వి. శివకృష్ణ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జుట్టు ప్రసాద్ గౌడ్, వార్డ్ మెంబర్ వెంకట్ వెంకటోల్ల బాబు గౌడ్, తాళ్ల నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ గౌడ్ మాట్లాడుతూ – “ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మొక్కలు నాటడం ద్వారా మానవాళిని రక్షించవచ్చు. ఇప్పటివరకు కేశవ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున వేల సంఖ్యలో మొక్కలు నాటడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే వృక్ష సంపద పెంపుకు మరింత కృషి చేస్తాము” అని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ పచ్చదనం కార్యక్రమాన్ని ప్రశంసించారు.

# నీట్ ప్రవేశ పరీక్షలో విజయం సాధించి ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించిన సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం



సంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 05:
నీట్ ప్రవేశ పరీక్షలో విజయం సాధించి ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించిన సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం. ఆదివారం రోజున సంగారెడ్డిలో గల వైయస్సార్ భవన్ లోని సంగారెడ్డి జిల్లాబీసీ సంక్షేమ సంఘం తరపున ఎంబిబిఎస్ ప్రవేశ పరీక్షలు విజయం సాధించిన జంగం ధీరజ్ స్వామి, మఠం బిల్వ శ్రేష్ట, పట్లోళ్ల సుదీప, చల్మెడ మహాదేవ్ పడిశెట్టి శ్రావ్య మడపతి కాత్యాయని, నాయి కోటి కీర్తన లను మెమెంటోలను మరియు శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ప్రభు గౌడ్ మాట్లాడుతూ డాక్టర్లు సంఘంలో చాలా ప్రధాన పాత్ర వహిస్తారు అలాగే వైద్య నారాయణ హరి అన్నారని పేర్కొన్నారు ముఖ్య అతిథు డాక్టర్ మల్లికార్జున గారు మాట్లాడుతూ మీరు కాబోయే డాక్టర్లు ఇక్కడికి ఆపకుండా ఎమ్మెస్ ఎండి చేసి మంచి భవిష్యత్తును సాధించగలరని మనస్ఫూర్తిగా నేను కోరుచున్నాను అని అన్నారు ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి ముఖ్య సలహాదారులు చంద్రయ్య స్వామి కార్యదర్శి సుధాకర్ గౌడ్, అధికార ప్రతినిధి మంగ గౌడ్ కార్మిక విభాగ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ యువజన యువజనవిభాగం అధ్యక్షుడు జావీద్ సంగమేశ్వర్ శివ ప్రభు ముఖ్య అతిథులు డాక్టర్ మల్లికార్జున ఎన్ శివ తదితరులు పాల్గొన్నారు

# కోహిర్ మండలంలో కాంగ్రెస్ నాయకుల విస్తృత స్థాయి సమావేశం

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి డా.. ఏ. చంద్రశేఖర్...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05:**
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పటేల్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి మరియు జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా.. ఏ. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై దృష్టి సారిస్తూ, పార్టీ గెలుపు కోసం నాయకుల సంఘటిత కృషి అవసరమని ఆయన అన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా కుల, మత భేదాలకతీతంగా ప్రతినాయకుడు పని చేయాలి. పార్టీకి లోబడి, నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తలకు అన్ని విధాలుగా మద్దతు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని డా.. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అలాగే కోహీర్ మండలంలో అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. బీ ఫామ్ ఎవరికి వచ్చినా, పార్టీ జెండా కింద కలసి పనిచేయాలి. ప్రజలకిచ్చే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్ తన్వీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, పీఏసిఎస్ ఛైర్మన్ రియాజ్, మాజీ ఎంపీపీ శౌకత్ అలీమహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబ్బాస్సుమ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముజామిల్, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, మల్లన్న పాటిల్, అశోక్, జ్ఞానరత్నం, శ్రీధర్ రెడ్డి, మల్లికార్జున్, షాకిర్ అలీ, శంషీర్, ఆర్షద్, ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు



# పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- తలకొక్కుల రాజు ఎన్నికల పరిశీలకులు



**గజ్వేల్ వెలుతురు అక్టోబర్ 05:**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం గజ్వేల్‌బి ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల ఎన్నికల పరిశీలకులు తలకుక్కుల రాజు విడుదల చేసినారు. సందర్భంగా మాట్లాడుతూ తేదీ 5 .10 .25 ఆదివారం రోజున ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం సమీపంలో గల పద్మశాలి ఫంక్షన్ హాల్ వద్ద ఉదయము 11:00ఏఎం గంటలకు గజ్వేల్ బిప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. తేదీ 7. 10 .25 రోజున నుండి 8.10.2025 రోజున ఉదయం 10 :00ఏఎం నుండి సాయంత్రం5:00పీఎం గంటల వరకు నామినేషన్ స్వీకరిస్తామన్నారు. తేదీ 9 .10.25 నామినేషన్ పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. తేదీ10.10.25 నామినేషన్ ఉపసంహరణ జరుగుతుందని తేదీ 11. 10. 25 రోజున ఉదయం 11: 00ఏఎం గంటలకు నామినేషన్ వేసిన అభ్యర్థులకే ఎలక్షన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయబడింది అన్నారు. సాయంత్రం 6:00పీఎం గంటలకు ,తుది జాబితా ప్రకటన. తేదీ 13. 10.25 సాయంత్రం 6:00పీఎం గంటలకు డమ్మీ బ్యాలెట్ పేపర్ విడుదల. తేదీ 19. 10. 25 ఆదివారం రోజున ఉదయం 8 గంటల నుండి3:00పీఎం గంటల వరకు పోలింగ్ జరుపబడును 4:00పీఎం గంటలకు ఓట్ల లెక్కింపు జరుగును. సాయంత్రం 5 :00పీఎం గంటల గెలిచిన అభ్యర్థుల ప్రకటన చేయబడును. 5:30 నిమిషములకు గెలిచిన అభ్యర్థులచే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉంటుందని ఎన్నికల పరిశీలకులు తలకుక్కుల రాజుగారు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దేవులపల్లి రాజారామ్ రాష్ట్ర కార్యదర్శి స్వర్గం రాజేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాజీ అధ్యక్షులు గాడి పల్లి శ్రీనివాస్ , సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంగం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, ఎన్నికల కమిటీ సభ్యులు తలకొక్కుల దేవదాస్,చంద్రం సార్ పెంటయ్య, కృష్ణ, యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్ పద్మశాలి రాష్ట్ర నాయకులు రాజేశం, పద్మశాలి జిల్లా ప్రచార కార్యదర్శి గాడిపల్లి బలరాం, తుమ్మ నరసింహులు గాడిపల్లి విజయ్ కుమార్ రమేష్ ,మధుసూదన్, దేవసాని వాసుదేవ్, కోట కిషోర్, మల్లేశం. దేవసాని పోశెట్టి పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం

## కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.. సిద్ధం, ఉజ్వల్‌రెడ్డి...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 05 :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పటేల్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మకమిటి చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాంలింగా రెడ్డి అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.. సిద్ధం.ఉజ్వల్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలుపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ ఛైర్మెన్ మొహమ్మద్ తన్వీర్, మాజీ జడ్పీటీసీ రాందాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్షద్ అలీ, పీఎసీఎస్ ఛైర్మెన్ రియాజ్, మాజీ ఎంపీపీ శౌకత్‌అలీ, మాజీ వైస్ ఎంపీపీ షాకిర్‌అలీ, మాజీ ఎంపీటీసీలు మల్లన్న పాటిల్, అశోక్, జ్ఞనరత్నం, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబ్బాస్సుమ్, పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జున్, శంషీర్‌అలీ, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

